Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL:2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 201 | Friday : 18.07.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :201 | శుక్రవారం 18 జూలై 2025 | వెల : 3 | పేజీలు : 4




- హైకోర్టు ఆదేశాలతో సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి చేయాలని లక్ష్యం
- బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం కోసం ఎదురు
- ఎంపీటీసీ, జెడ్పీటీసీకి సంబంధించి ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం యోచిస్తున్నట్లు సమాచారం.
- మరి గ్రామీణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో వేచి చూడాల్సిందే.
- జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఖరారుతో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది.

# ఏ క్షణమైనా నోటిఫికేషన్?

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఖరారుతో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. హైకోర్టు ఆదేశాలతో సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీకి సంబంధించి ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం యోచిస్తున్నట్లు సమాచారం. మరి గ్రామీణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో వేచి చూడాల్సిందే..స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. మొత్తం 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ క్షణంలోనైనా జరగవచ్చనే సంకేతాలను వెలువడుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖను ఆదేశించింది. ఎన్నికలకు అవసరమయ్యే సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని కూడా నిర్దేశించింది. సెప్టెంబర్ 30వ తేదీలోగా తెలంగాణలో స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు - మిగతా3లో

## ఎన్నికల 'పవర్ ప్లే'.. ఉచితం అంటూ బీహారీలకు నితీశ్ బంపరాఫర్!



- ఓటర్లను ఆకర్షించేందుకు ప్రభుత్వం, ప్రతిపక్షం.. ప్రజలకు వరాలు
- బీహార్‌లో 125 యూనిట్ల లోపు కరెంటు బిల్లులు వస్తే డబ్బులు చెల్లించాల్సి అవసరం లేదని ఆఫర్
- వచ్చే నెల నుంచే ఇది అమలులోకి



## రేవంత్.. రాజీనామా చేయి

- కాంట్రాక్టర్లను పెంచి పోషించడానికే బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకొచ్చారు
- తెలంగాణలో అచేతన సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తే రాష్ట్రానికి మంచి
- బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు
- కాంట్రాక్టర్లు, కమిషన్ల కోసమే దీన్ని కడుతున్నారు.

## రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత నాది

- రాయలసీమ దిశా దశను మార్చేది నీరు
- పశువులకు గడ్డి లేనప్పుడు, ఇతర ప్రాంతాల నుంచి గడ్డి తెప్పించి వాటి ఆకలి తీర్చా
- రాయలసీమకు నీళ్లు ఇవ్వాలని మొట్టమొదట ఆలోచించిన నాయకుడు ఎన్టీఆర్
- రాయలసీమకు జీవనాడి అయిన హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు శరవేగంగా పూర్తి
- రికార్డు స్థాయిలో ఈ పనులు పూర్తి చేయడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, నంద్యాల**

రాయలసీమ చరిత్రలో ఈరోజు (జూలై 17) ఒక శుభదినంగా నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నంద్యాల పర్యటన సందర్భంగా అన్నారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన తాను రాయలసీమకు నీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేసిన ఈ రోజును ఎప్పటికీ మరచిపోలేనంటూ ఉద్వేగభరితంగా మాట్లాడారు. రాయలసీమ దిశా దశను మార్చేది నీరు అని సీఎం ప్రస్తావించారు. గతంలో రాయలసీమలో నీటి కొరత వల్ల - మిగతా3లో



## అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత

- గత రెండు రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణం
- యాత్రా మార్గంలో భారీ వర్షాలు కురియనున్నాయని వాతావరణశాఖ హెచ్చరికలు
- కుండపోత వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడే అవకాశం




## ప్రభుత్వంలో కలవాలన్న ఆహ్వానం తర్వాత.. ఫడ్నవీస్‌ను కలిసిన ఉద్ధవ్ ఠాక్రే

- శాసన మండలి చైర్‌పర్సన్ రామ్ షిండే గదిలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఉద్ధవ్ ఠాక్రే సమావేశం
- అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి నియామకం, వివాదాస్పద త్రిభాషా విధానం వంటి అంశాలపై చర్చ

## బంగ్లాదేశ్‌లో పాక్ తాలిబన్ల నియామకాలు!

- ఉగ్రదాడులకు పాల్పడుతున్న తెహ్రీకే ఈ తాలిబన్ పాకిస్థాన్ ఇప్పుడు తన కార్యకలాపాలను బంగ్లాదేశ్‌కు విస్తరించింది
- భారత్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం

# 22 ప్రాజెక్టులతో 30,899 ఉద్యోగాలు



- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 8వ ఎస్ఐపీబీ సమావేశం
- హాజరైన లోకేశ్, అచ్చెన్నాయుడు, కేశవ్, టీజీ భరత్, అనగాని తదితరులు
- రూ.39,473 కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల చుట్టూ సంబంధిత ఎకో సిస్టం వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎకో సిస్టం ద్వారా ఆయా ప్రాజెక్టులతో పాటు స్థానికులు, అనుబంధ సంస్థలకూ లబ్ధి కలుగుతుందని సీఎం స్పష్టం చేశారు. గురువారం నాడు సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 8వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, కె.అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్ లు హాజరయ్యారు. ఎస్ఐపీబీ సమావేశానికి సీఎస్ కె.విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన, పర్యాటక రంగాలకు సంబంధించిన రూ.39,473 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలియచేసింది. పరిశ్రమలు-వాణిజ్య రంగానికి చెందిన 11 ప్రాజెక్టులు, ఇంధన రంగంలో 7, పర్యాటక రంగంలో 3, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఒక్కోటి చొప్పున ప్రాజెక్టులు ఎస్ఐపీబీ ఆమోదం పొందాయి. మొత్తం 22 ప్రాజెక్టుల ద్వారా 30,899 మందికి ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి.

- మిగతా3లో



## రెన్యూవబుల్ ఎనర్జీ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ సహకారం కావాలి

- సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ..
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం కుదుర్చుకున్న పలు కీలకమైన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి
- తెలంగాణలోని అధిక సౌరవిద్యుదుత్పత్తి సామర్థ్యం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం.
- గ్రిడ్ స్టెబిలిటీ, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను అభివృద్ధి చేయడం



## బెంగళూరు తొక్కిసలాటపై ప్రభుత్వం సంచలన నివేదిక

- ఆర్సీబీ, కోహ్లీపై ఆరోపణలు!
- వేడుకలకు సంబంధించి వారు సమాచారం మాత్రమే ఇచ్చారు
- అంతేగానీ.. వేడుకల గురించి ఫార్మట్ ప్రకారం అనుమతులు కోరుతూ ఎలాంటి అభ్యర్థనలు చేయలేదు
- ఇలాంటి ఈవెంట్‌ల కోసం కనీసం ఏడు రోజుల ముందే అనుమతులు తీసుకోవాలి

# జాబ్ పేరుతో పైసా వసూల్



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 17:**
అన్నమయ్యజిల్లా పీలేరు పట్టణంలో ఎలైట్ కవర్స్ డేటా సొల్యూషన్ పేరుతో ఓ సంస్థ ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి ఒక్కక్కరి నుండి 3020 వసూలు చేసింది. మీరు కొంతమంది, జాయిన్ చేస్తే ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు కమిషన్ ఇస్తామని ఇలా లింక్ ద్వారా సుమారు 1500 మంది నుంచి 3000 చొప్పున కట్టించుకుని రాత్రికి రాత్రి బోర్డు తిప్పేయడంతో బాధిత మహిళలు రోడ్డుపై ధర్నా చేశారు.

# నేడు కమిటీ సభ్యుల విస్తృతస్థాయి సమావేశం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై17:**



శ్రీకాళహస్తి తొట్టంబేడు చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ జూలై 18వ తేదీన శుక్రవారం మధ్యాహ్నం 03:00 గంటలకు శ్రీకాళహస్తిపట్టణం సరస్వతి ఆడిటోరియంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ వై. యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు అనుబంధవి భాగాల కమిటీ సభ్యుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తారు.ఈ సమావేశం శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి చిత్తూరు జిల్లావైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి,తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి,ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పాల్గొంటారని. ఉమ్మడి జిల్లా వైసిపి ప్రధానకార్యదర్శి ఉన్నం వాసు దేవనాయుడు ఓప్రకటన ద్వారా తెలియ జేశారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం శ్రీకాళహస్తి మండలం, ఏర్పేడు మండలం, తొట్టంబేడు మండలం, రేణిగుంట మండలం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు, మహిళల అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు తప్పకుండా హాజరుకావాలని ఉన్నం వాసుదేవ నాయుడు పిలుపునిచ్చారు.

# సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



**వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 17:**
రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, మన ప్రియతమ గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే సూచనలు, ఆదేశాల మేరకు వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంగ్రామ పంచాయతీ నక్కలంపల్లిలో జరిగిన "సుపరిపాలనలో తొలి అడుగు" గురువారం రోజు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వెదురు కుప్పం మండలం తెలుగుదేశం పార్టీ మండలం అధ్యక్షులు లోకనాథ రెడ్డి, నియోజికవర్గం తెలుగు యువత అధ్యక్షులు గురుసాల కిషన్ చంద్, క్లస్టర్04 చంగల్ రాయరెడ్డి, నియోజకవర్గం అధ్యక్షులుచాణిక్యప్రతాప్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చంగల్ రాయులు, జిల్లా వాణిజ్య విభాగ కార్యనిర్వహణ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్ వర్మ, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు బృహస్పతి, సీనియర్ నాయకులు జయరాంరెడ్డి, గ్రామపంచాయతీ ప్రధానకార్యదర్శి వెంకటేష్, యోగేష్, లోకేష్, టిడిపియువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 17:**
శ్రీకాళహస్తి పవన్ కళ్యాణ్ ఆశయంలో భాగంగా శ్రీకాళహస్తిలో ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నందు పేట బ్రదర్స్ఆధ్వర్యంలో 53వ వారం డొక్కాసీతమ్మ అన్నదాన కార్యక్రమమును పవన్ కళ్యాణ్ ఆశయాల కృషి కోసం పనిచేసే జనసేన నాయకులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డొక్కాసీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వాహకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, మహేష్, గంధం శ్రీను, మనీ, నవీన్, రమేష్ బాబు, మునిచంద్ర, యాసిన్ భాష, చందు, ప్రభాకర్, రాజా, మునికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వివాహిత మహిళ అదృశ్యం పై కేసు నమోదు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 17:**
మహిళ అదృశ్యంమైన సంఘటన చౌడేపల్లి మండలం లద్దిగంలో చోటు చేసుకుంది ఎస్సై నాగేశ్వరరావు కథనం మేరకు లదిగం గ్రామ పంచాయతీ ఎం. రమేష్ భార్య ఎం.నాగేశ్వరి (28)14వ తేదీన 3:15%జూఎ% ఇంటి నుంచి కనపడ కుండా అయినట్లు నాగేశ్వరి భర్త ఎం. రమేష్ రెండు రోజులుగా వారి బంధు మిత్రుల వద్ద చుట్టుపక్కల గ్రామాలలో యందు వెతికితే పుంగనూరు టౌన్‌లోని నక్కబండ ప్రాంతానికి వెళ్లి అక్కడ నుంచి ఎక్కడికో వెళ్లిపోయి నట్టు తెలుస్తుంది. ఎంత వెతికినా ఫలితం దక్కకపోవడంతో చౌడేపల్లిమండలం పోలీస్ స్టేషన్‌లో 17 ఈనెలన ఫిర్యాదు చేయడం జరిగింది. నాగేశ్వరి భర్త ఎం.రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

# ఘనంగా పిఎస్ 4 కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై17:**
శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాలతో పట్టణంలోని 6,10,11వ వార్డ్ సచివాలయం ఇరిగేషన్ క్వార్టర్స్‌లో పి4 కార్యక్రమంలో బంగారు కుటుంబము కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన విధానంతోకూటమి ప్రభుత్వం చేపట్టిన పిఎస్ 4 అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ వార్డ్ సభలో తల్లికి వందనం ప్రతి ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి డబ్బులు వచ్చాయని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ మహిళలు ధన్యవాదాలు తెలిపారు. వార్డ్ ప్రజలు వద్ద నుంచి కొన్ని ఫిర్యాదులు తీసుకొని వచ్చారు. అందులో ఒకటి పట్టణంలోనే కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాల వద్ద మా పిల్లలకు విద్యార్థులతో కొంత మంది ఆకతాయిలు ఇవిటీజింగ్ చేస్తుండరూ అని మహిళలు చెప్పారు. మైనారిటీ నాయకుడు షాకీరాలి ఫ్యాషన్ సభ్యులు ద్వారా వన్‌టౌన్ సీఐ గోపి మాట్లాడారు వెంటనే సీఐ గోపి అక్కడకి పోలీస్ సిబ్బందినీ పంపారు. సమస్యను తెలియజేసి స్కూల్ వద్ద పికెటింగ్ శాసనసభ్యులు ద్వారా ఏర్పాటు చేశారు. అలాగే కొంత మంది డ్వాక్రా మహిళలు, ఆర్‌పిలు వార్డ్‌లలో సమైక్య మరియు డ్వాక్రా గ్రూపులు నడుపుటకు ఒక ప్రదేశాన్ని చూపాలని కోరారు. ఆ సమస్యను కూడా శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చెప్పి పరిష్కరిస్తామని. మహిళా గ్రూపు సభ్యులకు చెప్పడం జరిగింది. టిట్‌కో ఇల్లు త్వరగా ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని వార్డు నాయకులు తెలిపినారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశంనాయకులు, రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి. షాకిర్ అలీ.టౌన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ ఖాదర్ బాషా. 73వ బూత్ ఇంచార్జ్ లోకేష్. పదోవార్డు నాయకులు సి.ఎస్ మస్తాన్, మధుసూదన్ రావు, బి.రమేష్, 6వవార్డు నాయకులు మునరాజా యాదవ్. తీర్థం వెంకటేశులు సచివాలయ సిబ్బంది. మునిసి పల్ అధికారులు. ఆర్‌పిలో పెద్ద ఎత్తున వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎస్.కె వెంకటరమణారెడ్డి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 17:**
రాష్ట్ర ఐటీ శాఖమంత్రి నారాలోకేష్ శ్రీహరి హర హనుమదీశ్వర అయ్యప్ప సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.కె వెంకటరమణారెడ్డి కలిశారు. మంగళగిరిలోని మంత్రి నారాలోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్లు కలిసి పుంగనూరు నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. అదేవిధంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యల ను తెలియజేశారు. అంతేకాకుండా నియోజకవర్గ పరిస్థితులపై నారా లోకేష్ ఆరా తీసినట్లు తెలిసింది ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచులకు సంఘ మాజీ అధ్యక్షుడు యదు శేఖర్ నాయుడు రైతు అధికార ప్రతినిధి సోమల సురేష్ తంబళ్లపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొండ్రెడ్డి తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

# చినుకు పడితే మేకల చిన్నేపల్లిలో చెరువే

## పట్టించుకోని అధికారులు.. అవస్థల్లో విద్యార్థులు ప్రజలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 17:**
కొద్దిపాటి జల్లులు పడితేనే ఆ పాఠశాల ముందు చెరువును తలపిస్తుంది. విద్యార్థులు ప్రజలు అవస్థలు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి చౌడేపల్లి మండలం శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లిలో గల ప్రాథమిక పాఠశాల, ముందు కొద్దిపాటి వర్షం పడితేనే చెరువును తలపిస్తోంది. ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాల తో పాటు పెద్ద ఉప్పరపల్లి వెళ్లే మార్గంలో ఈ దుస్థితి నెలకొని ఉంది దీంతో విద్యార్థులు గ్రామస్తులు ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులు, తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. పాఠశాలలోకి వెళ్లాలంటేనే విద్యార్థులు భయభ్రాంతులకు లోనవుతు న్నారు. అధికారులకు తెలిసినప్పటికీ పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి ఇకనైనా సంబంధిత ఉన్న తాధికారులు స్పందించి, గ్రామంలోని నీటిని కాలువల ద్వారా వెలుపలకి పంపేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వాహ నదారులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# కారంచేడు అమర వీరులకు నివాళులు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై17:**
అన్నమయ్యజిల్లా పీలేరు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీమందకృష్ణ మాదిగ ఆదేశా నుసారం, అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గ ఎంఎస్‌పి ఇన్చార్జి గండికోట వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కారంచేడు మృతవీరులకు నివాళులు అర్పించే కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకులు మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరిని కుమార్, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పాలకుంట్ల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ముల్లంగి కృష్ణయ్య,బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి చిత్తూరుజిల్లా కన్వీనర్ ఎద్దుల మహేష్ యాదవ్‌లు పాల్గొన్నారు స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కారంచేడు మృతవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేడు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు చట్టంమనకు అమల్లోకి వచ్చిందని ఈ చట్టాన్ని పెడదోవ పట్టకుండా సక్రమమైన మార్గంలో సద్వినియోగం చేసుకొని మన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాసంఘాలపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో వెంకటరమణ, చంద్రయ్య, రాచపల్లి వెంకటరమణ, విజయ భాస్కర, గండికోట రెడ్డి కుమార్, రాజేష్, నరసింహ, ఎంఎస్‌పి నాయకులు బాలసుబ్రమణ్యం, మురళి, విహెచ్పిఎస్ నాయకులు భాస్కర, వెంకటేష్,బీసీ నాయకులు అంబులెన్స్ బాబు, రవీంద్ర, హరీష్, మైనారిటీ నాయకులు ఫైర్ రోజ్ ఖాన్, నాయకులు అన్నవరం, రవి,రాము, తదితరులు పాల్గొన్నారు.

## పి జ్యోతి రెడ్డి ఉన్నత పాఠశాలలో

# చినుకు రాలితే చేరువే

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 17:**



చిత్తూరు పట్టణము సికేపల్లిలో గల పి జ్యోతి రెడ్డి ఉన్నత పాఠశాలలో చినుకు రాలితే చెరువే తరగతి గది ముందు వర్షానికి నీళ్లు నిలవడం జరిగింది. ఈ నీళ్లు బయట పోకుండా ఒకే చోట ఉండడం వలన విద్యార్థులకు ఉపాధ్యాయులకు తరగతి గదులకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడము జరుగుతుంది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది కావున రాబోయే కాలాలు వర్షాకాలాలుగా ఉండడం, వలన అధికారులు దయవుంచి ఈ సమస్యలను పరిష్కరించవలసిందిగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై17:**
కుప్పం మున్సిపాలిటీ 22వ వార్డు165 బూత్‌లో కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏడాదికాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం టీటీడీ బోర్డ్ మెంబర్ వైద్యం శాంతారాం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్ క్లస్టర్ ఇంచార్జ్ కౌన్సిలర్ సోమశేఖర్ 22వ వార్డ్ కౌన్సిలర్ సురేష్, బూత్ ఇంచార్జ్ శారదమ్మ, యూనిట్ ఇంచార్జ్ నాగార్జున, గంగమ్మ గుడి డైరెక్టర్ సరన, నరేష్, రాధా, కేవస్ ఎస్, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆడినెల ప్రారంభోత్సవం సందర్భంగా

# వల్లి దేవసేనా సమేత శ్రీసుబ్రహ్మణ్య స్వామి వారి పల్లకి ఊరేగింపు



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 17:**
కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కెనమాకులపల్లి గ్రామంలో ఆడి నెల ప్రారంభోత్సవమైందని మొదటిరోజు శ్రీవల్లిదేవసేనా సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామిని పురవీధులలో గ్రామస్తులు ఊరేగించడం జరిగింది. అంగరంగ వైభవంగా పూల పల్లకిని అలంకరించి ఊరేగింపు చేశారు. మహిళా భక్తులు మంగళ హారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు ,భజన బృందం అద్భుతంగా వాయిద్యాలు వాయించారు. స్వామిని దర్శించుకున్న ప్రతి మహిళ భక్తులకి శ్రీ కాణిపాకం లడ్డూను ప్రసాదంగా పూజ తట్టలో అందించారు,ఈ కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించి గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వం ఏడాది సుపరి పాలనకు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ నియోజకవర్గ ఇంచార్జ్ పిఎస్ మునిరత్నం





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 17:**
కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం కెంచనబల్ల పంచాయతీ పచ్చరు మాకులపల్లిలో 86 బూత్‌లో ఇంటింటికీ తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాను. భవిష్యత్తులో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించాను. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరాతీశాను. అభివృద్ధి పనులపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామకుప్పం మండలం నాయకులు పాల్గొన్నారు.

# పి–4, స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర, సీజనల్ వ్యాధులపై

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్ష సమావేశం

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై17:**




జిల్లా సచివాలయంలోని సమావేశం మందిరంలో జిల్లాలోని హెచ్వోడీలు, మున్సిపల్ కమిష నర్లు, ఎంపీడీవోలతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పి – 4, స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర, సీజనల్ వ్యాధులపై జిల్లా జాయింట్ కలెక్టర్ జి విద్యాధరితో కలసి సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐఏఎస్. పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులను వెంటనే గుర్తించి నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. జూలై 19న "ప్లాస్టిక్ వ్యతిరేకంగా 3వ శనివారం" కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు మరియు మహిళా సంఘాల సభ్యులకు ప్లాస్టిక్ వాడకానికి ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాల్సిందిగా అధికారులను కలెక్టర్ ఆదేశించారు

# 22 ప్రాజెక్టులతో 30,899 ఉద్యోగాలు

-మొదటిపేజీ తరువాయి

**సమీకృత ప్రణాళికతో పారిశ్రామిక ప్రాజెక్టులు**

పారిశ్రామిక ప్రాజెక్టులకు సమీపంలో రహదారులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు లాంటి మౌలిక సదుపాయాలతో పాటు ఆ ప్రాంతంలో ఎకనామిక్ యాక్టివిటీ పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భూములు ఇచ్చిన రైతులు, స్థానికులకు ప్రయోజనం కలిగితేనే వారు సంతోషంగా భూములు ఇవ్వగలుగుతారని సీఎం పేర్కొన్నారు. భూములు కేటాయించిన ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా తమ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

పర్యాటక ప్రాజెక్టుల విషయంలోనూ సమీకృత ప్రణాళికల్ని అమలు చేయాల్సిందిగా సీఎం ఆదేశాలు జారీ చేశారు. కేవలం నిర్దేశిత ప్రాజెక్టుకు మాత్రమే పరిమితం కాకుండా అనుబంధంగా కార్యకలాపాలు వచ్చేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. ప్రత్యేకించి సర్వీసు సెక్టార్ కూడా వచ్చేలా ప్రాజెక్టులను ఇంటిగ్రేట్ చేయాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. పీపీపీ విధానంలో చేపట్టే పర్యాటక ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ భూములను సేకరించి సిద్ధం చేసుకోవాలని అన్నారు.

శ్రీశైలంలో దేవాలయంతో పాటు భారీ నీటి ప్రాజెక్టు కూడా ఉందని ఎక్కువ మంది పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఆస్కారం ఉండేలా సమీకృత పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే శ్రీశైలం రహదారి విస్తరణపైనా దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఆతిథ్య రంగంలో కేవలం హోటల్ గదులకు మాత్రమే పరిమితం కాకుండా అనుబంధ వినోద కార్యకలాపాలు, సేవల రంగానికి సంబంధించిన ప్రాజెక్టులు వచ్చేలా చూడాలన్నారు. మరో వైపు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఎంత మందికి ఉద్యోగాలను కల్పించామో వివరాలు తెలిసేలా ఎంప్లాయిమెంట్ పోర్టల్ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**8వ ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులు**

1. ఫినామ్ పీపుల్ ప్రైవేటు లిమిటెడ్ – విశాఖలో రూ.205 కోట్లు పెట్టుబడి, 2500 ఉద్యోగాలు.
2. శ్రీజా మహిళా ప్రొడ్యూసర్ కంపెనీ– చిత్తూరులో రూ.282 కోట్లు పెట్టుబడి, 1400 ఉద్యోగాలు.
3. రెన్యూ వ్యోమన్ పవర్ లిమిటెడ్ – కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ.1800 కోట్లు పెట్టుబడి, 380 ఉద్యోగాలు.
4. రెన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ – కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ.3600 కోట్ల పెట్టుబడి, 760 ఉద్యోగాలు




5. జేఎస్ డబ్ల్యూ నియో ఎనర్జీ – కడప జిల్లాలో రూ.2000 కోట్ల పెట్టుబడి, 1380 ఉద్యోగాలు
6. పీవీఎస్ రామ్మోహన్ ఇండస్ట్రీస్ – శ్రీకాకుళం జిల్లాలో రూ.204 కోట్లు పెట్టుబడి, 1000 ఉద్యోగాలు
7. పీవీఎస్ గ్రూప్ – విజయనగరం జిల్లాలో రూ.102 కోట్ల పెట్టుబడి ,500 ఉద్యోగాలు
8. ఆర్వీఆర్ ప్రైవేట్ లిమిటెడ్– నంద్యాల జిల్లాలో పంప్డ్ స్టోరేజి పవర్ ప్రాజెక్టు, రూ.4708 కోట్ల పెట్టుబడి, 1200 ఉద్యోగాలు
9. ఐటీసీ హోటల్స్ లిమిటెడ్ – విశాఖలో రూ.328 కోట్ల పెట్టుబడి, 1100 ఉద్యోగాలు
10. లాన్సమ్ లీజర్స్ లిమిటెడ్ ఎంటర్టైన్మెంట్– విశాఖలో రూ.86 కోట్ల పెట్టుబడి, 720 ఉద్యోగాలు
11. స్టార్ టర్న్ హోటల్స్ ఎల్ఎల్ పీ– తిరుపతిలో రూ.165 కోట్ల పెట్టుబడి , 280 ఉద్యోగాలు
12. గ్రీన్ ల్యామ్ లిమిటెడ్ – తిరుపతి నాయుడుపేట సెజ్ లో రూ.1147 కోట్ల పెట్టుబడి, 1475 ఉద్యోగాలు
13. యాక్సెలెంట్ ఫార్మా – తిరుపతి శ్రీసిటీలో రూ.1358 కోట్ల పెట్టుబడి, 1770 ఉద్యోగాలు
14. అగస్త్య ఎనర్జీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ – కర్నూలు జిల్లాలో (సోలార్ సెల్, పీవీ మాడ్యూల్ ఉత్పత్తి), రూ.6933 కోట్ల పెట్టుబడి, 2138 ఉద్యోగాలు
15. జేఎస్ డబ్ల్యూ ఏపీ స్టీల్ ప్లాంట్ – కడప జిల్లా స్టీల్ ప్లాంట్ రూ.4500 కోట్ల పెట్టుబడి (రెండు దశల్లో), 2500 ఉద్యోగాలు
16. రెన్యూ ఫోటో వోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్– అనకాపల్లి జిల్లా (ఫోటో వోల్టాయిక్ ప్లాంట్) రూ.3700 కోట్ల పెట్టుబడి, 1200 ఉద్యోగాలు
17. లారస్ ల్యాబ్స్ – అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్ద రూ.5630 కోట్ల పెట్టుబడి, 6350 ఉద్యోగాలు
18. లులూ షాపింగ్ మాల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్– విశాఖ, విజయవాడలలో రూ.1222 కోట్లు పెట్టుబడి, 1500 ఉద్యోగాలు
19. ఏస్ ఇంటర్నేషనల్ – చిత్తూరు జిల్లా కుప్పంలో డైరీ యూనిట్ రూ.1000 కోట్ల పెట్టుబడి, 2000 ఉద్యోగాలు
20. బ్రాండిక్స్ ఇండియా అపారెల్ సిటీ ఇండియా– అచ్యుతాపురం సెజ్ లో ఫుట్ వేర్, టాయ్స్ తయారీకీ అనుమతి
21. వీఎస్ఆర్ సర్కాన్ – శ్రీకాకుళం జిల్లాలో రూ.39 కోట్ల పెట్టుబడి, 246 ఉద్యోగాలు
22. అవిశా ఫుడ్స్ అండ్ ఫ్యూయెల్స్ – కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామిక పార్కులో రూ.500 కోట్ల పెట్టుబడి, 500 ఉద్యోగాలు

కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకూ జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల్లో 109 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో పారిశ్రామిక రంగానికి చెందిన 46 ప్రాజెక్టులు, ఇంధన రంగానికి చెందిన 41 ప్రాజెక్టులు, పర్యాటక రంగలో 11, ఐటీ లో 7, ఫుడ్ ప్రాసెసింగ్ 4 పరిశ్రమలకు చెందిన పెట్టుబడులు ఎస్ఐపీబీ ఆమోదం పొందాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా రూ.5,74,238 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. అలాగే 5,05,968 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి.

# రెన్యూవబుల్ ఎనర్జీ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ సహకారం కావాలి

**ఢిల్లీ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రతిపాదించిన పునరుత్పాదక ఇంధన (రెన్యూవబుల్ ఎనర్జీ) కార్యక్రమాలపై తెలంగాణ ప్రభుత్వ సహకారం కోరుతూ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ముఖ్యంగా కోల్ ఇండియా లిమిటెడ్ నేవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం కుదుర్చుకుని, సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటి కీలకమైన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని కిషన్‌రెడ్డి లేఖలో తెలిపారు. ఈ ప్రాజెక్టులు వచ్చే మూడేళ్లలో దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్శించనున్నాయి.

**లేఖలో కీలక ప్రతిపాదనలు:**

తెలంగాణలోని అధిక సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం.

గ్రిడ్ స్టెబిలిటీ, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను అభివృద్ధి చేయడం.

క్రిటికల్ బ్యాలెన్సింగ్ కెపాసిటీని అందించేందుకు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాల అధ్యయనం, అమలు.

ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడానికి, స్థానిక ఆర్థిక ప్రయోజనాలను పెంచడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ



సంస్థలతో లేదా బొగ్గు కంపెనీలు స్వతంత్ర ప్రాతిపదికన జాయింట్ వెంచర్ మోడల్స్ ఏర్పాటు చేయడం.

ఈ ప్రతిపాదనలు, ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు అవసరం.

ఈ ప్రాజెక్టులు కర్బన ఉద్గారాలను తగ్గించడం, గాలి నాణ్యతను మెరుగుపరచడం, సహజ వనరుల నిర్వహణ తదితర విషయాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. వీటి ద్వారా ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఇంధన భద్రతతోపాటుగా, అవసరమైనంత మేర విద్యుత్ ను అందుబాటులోకి తీసుకురావడం, సమ్మిళిత అభివృద్ధి, జీవన ప్రమాణాలను పెంచడం వంటి సామాజిక–ఆర్థిక ప్రయోజనాలు కూడా లభించనున్నాయి. ఈ ప్రాజెక్టులు విజయవంతంగా అమలుకావడానికి రాష్ట్ర ప్రభుత్వం, %జూాఖ%ల మధ్య నిర్మాణాత్మక భాగస్వామ్యం, సరైన సమన్వయం అత్యంత అవసరం. ఇందుకోసం మీరు ప్రత్యేకమైన చొరవతీసుకోవాలని కోరుతున్నాను. మీ జోక్యంతోనే ఈ ప్రాజెక్టులు వేగంగా, సమర్థవంతంగా అమలు అవుతాయని విశ్వసిస్తున్నాను.


పునరుత్పాదక విద్యుదుత్పత్తిలో తెలంగాణ సామర్థ్యాన్ని గుర్తిస్తూ.. రాష్ట్రంలో హరితాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణమైన చిత్తశుద్ధితో సహకారం అందిస్తోంది. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. భారతదేశ సుస్థిర విద్యుత్ వ్యవస్థలో తెలంగాణ పాత్ర కీలకం కానున్న సందర్భంలో.. ఈ ప్రాజెక్టుల ప్రాధాన్యత మరింత పెరగనుంది. తెలంగాణకు ఉన్న పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యం, హరితాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను దృష్టిలో ఉంచుకుని.. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరో మెట్టు ముందుకు తీసుకెళ్తాయి. దీంతోపాటుగా భారతదేశం సుస్థిర ఇంధన పరివర్తన దిశగా చేస్తున్న కృషిలో తెలంగాణ కీలక పాత్ర పోషించడానికి ఇదొక చక్కటి అవకాశం. భారతదేశపు దీర్ఘకాల ప్రణాళికలైన ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణను సాకారం చేసుకోవడంలో భాగంగా ఆర్థిక పురోగతిని, అభివృద్ధి అవకాశాలను సమతుల్యం చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత కీలకం.

పర్యావరణ పరిరక్షణతో పాటుగా ఆత్మ నిర్భరతతో కూడిన భవిష్యత్‌ను ఏర్పరచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిర్మాణాత్మక సహకారంలో మీ చొరవ కీలకం. తెలంగాణలో రానున్న ఈ సానుకూల మార్పుకు మీ సహకారాన్ని కోరుతూ.. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, మా శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలనుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు.

# ఏ క్షణమైనా నోటిఫికేషన్?

-మొదటిపేజీ తరువాయి

కల్పించేందుకు అవసరమైన ఆర్డినెన్స్‌ను సిద్ధం చేసి ఇప్పటికే గవర్నర్‌కు పంపింది. గవర్నర్ ఆమోదం లభించిన వెంటనే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు అధికారికంగా తెరలేవనుంది. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఐదు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వర్షాకాలం, శాంతిభద్రతల పరిస్థితి, గిరిజన ప్రాంతాలకు పోలింగ్ సిబ్బంది రవాణా, పోలింగ్ మెటీరియల్ తరలింపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2019లో ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించగా, అప్పుడు వేసవి కావడంతో అది సాధ్యమైంది. ఇప్పుడు వర్షకాలం కావడం, దానివల్ల ఎదురయ్యే ఇబ్బందులను అంచనా వేసి ఈసారి ఐదు విడతల్లో నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారాన్ని అందించిన వెంటనే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు కసరత్తు జరుగుతోంది. పోలింగ్ స్టేషన్లు, ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ అధికారులు ఇప్పటికే




సిద్ధం చేశారు. ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల పోలింగ్ సిబ్బంది, పోలీసుల తరలింపు సులువు అవుతుందని, పర్యవేక్షణలోనూ ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. వర్షాల వల్ల రవాణాకు, ఓటింగ్‌కు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయానికి వచ్చారు.

నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ వరకు మధ్య ప్రక్రియను పూర్తి చేయడానికి దాదాపు 15 రోజుల సమయం అవసరం. 2019 ఎన్నికల సమయంలో ఒక్కో దశకు నాలుగు రోజుల విరామం ఇవ్వగా, ఈసారి రెండు నుంచి మూడు రోజులు మాత్రమే ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారం అందించిన తర్వాత, పోలీసు అధికారులతో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటారు. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రెండు ఎన్నికలకు ఒకే రోజు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలో గ్రామీణ, మండల స్థాయిలో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి మార్గం సుగమం చేయనున్నాయి.

# రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత నాది



-మొదటిపేజీ తరువాయి

వేరుశనగ పంటలు ఎండిపోయినప్పుడు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకున్నట్లు చంద్రబాబు గుర్తు చేశారు. కాగా, మల్యాల వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం నుంచి మూడు పంపుల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీటిని విడుదల చేశారు.

**రాయలసీమకు జీవనాడి**

పశువులకు గడ్డి లేనప్పుడు, ఇతర ప్రాంతాల నుంచి గడ్డి తెప్పించి వాటి ఆకలి తీర్చామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాయలసీమకు నీళ్లు ఇవ్వాలని మొట్టమొదట ఆలోచించిన నాయకుడు ఎన్టీఆర్ అని, ఆయన ఆలోచనలను సాకారం చేసిన ఏకైక వ్యక్తి కూడా ఎన్టీఆరే అని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమకు జీవనాడి అయిన హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు శరవేగంగా పూర్తి చేశామన్నారు. మొదటి ఫేజ్ పూర్తి చేసి మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి నీటిని విడుదల చేసిన సీఎం.. హంద్రీనీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 2200 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు పెంచడం వల్ల సీమ రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

**సీఎం అభినందనలు**

రికార్డు స్థాయిలో ఈ పనులు పూర్తి చేయడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు ముఖ్యమంత్రి. ఇదే స్ఫూర్తితో త్వరలోనే ఫేజ్–2 పనులు పూర్తి చేద్దామని, నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీటిని అందించే ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నీళ్లిస్తే రైతులు బంగారం పండిస్తారని, సంపద సృష్టికి మూలమైన జలాన్ని ప్రతి ఎకరాకు అందించాలనే సంకల్పాన్ని అందరి సహకారంతో నేరవేరుస్తామన్నారు. ఈ క్రమంలో రైతన్నల సాగునీటి కష్టాలు తీర్చి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**జగన్ ప్రభుత్వంపై..**

ఇదే సమయంలో గత జగన్ ప్రభుత్వంపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్, ఐదేళ్లలో రాయలసీమను విధ్వంసం చేశారన్నారు. హంద్రీ–నీవాకు పది పైసలు కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. కులాలు, మతాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించారని, అలాంటి నాయకులు రాజకీయాలకు అనర్హులని విమర్శించారు. ఇకపై రాయలసీమకు నీటి కష్టాలు ఉండవన్నారు. ఈ ప్రాంతం రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**రాజకీయ విమర్శలు**

గత ప్రభుత్వం రోడ్లను గోతుల మయంగా మార్చిందని, మామిడి కాయలను రోడ్డుపై పారబోసి విధ్వంసం సృష్టించిందని చంద్రబాబు విమర్శించారు. రౌడీ మూకలు తోక జాడిస్తే కట్ చేస్తామని హెచ్చరించారు. రాయలసీమలో ముఠా కక్షలు లేకపోతే, ఈ ప్రాంతం దేశంలోనే అత్యుత్తమంగా ఉంటుందని సీఎం అన్నారు. హైదరాబాద్ కంటే మిన్నగా అమరావతిని నిర్మిస్తామని, ప్రధాని నరేంద్ర మోదీ సూచనల మేరకు నదుల అనుసంధానం చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. వేదవతి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని, గోరుకల్లు, అలగనూరు రిజర్వాయర్‌ల మరమ్మతులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**ఇతర అభివృద్ధి కార్యక్రమాలు**

అనంతపురంలో కియా ప్లాంట్: పట్టుదలతో అనంతపురంలో కియా ప్లాంట్‌ను తీసుకొచ్చినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు.

ఓర్వకల్లులో డ్రోన్స్ హబ్: ఓర్వకల్లును దేశంలోనే డ్రోన్స్ తయారీ కేంద్రంగా మార్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.

నందికొట్కూరు అభివృద్ధి: మిడ్తూర్ వద్ద రూ.60కోట్లతో లిఫ్ట్ నిర్మాణం, నందికొట్కూరులో 100 పడకల ఆసుపత్రికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

మామిడి కొనుగోలు: చిత్తూరు జిల్లాలో రైతుల నుంచి రూ. 270 కోట్లతో మామిడి కొనుగోలు చేశామని తెలిపారు.

నిరుద్యోగ భృతి: నిరుద్యోగ యువతకు భృతి అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## రేవంత్ రాజీనామా చేయి...

**హైదరాబాద్ :** కేవలం కాంట్రాక్టర్లను పెంచి పోషించడానికే బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకొచ్చారని ఆరోపించారు ఎమ్మెల్సీ కవిత. ఢిల్లీలో జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంపై ఆమె స్పందించారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల సీఎంలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో అచేతన సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తే రాష్ట్రానికి మంచి జరుగుతుందని కామెంట్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు కవిత. కాంట్రాక్టర్లు, కమీషన్ల కోసమే దీన్ని కడుతున్నారని ఆరోపించారు. అంతా కలిసి మెగా సంస్థకు ప్రాజెక్టు కట్టబెట్టే ప్రయత్నాల్లో ఉన్నారని విమర్శించారు. “కాంట్రాక్టర్లు, కమీషన్ల కోసం బనకచర్ల కడుతున్నారు. మెగా కంపెనీ వాటా కోసమే ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లారు. చంద్రబాబు అజెండాలో భాగంగానే సమావేశం సాగింది.” అని ఆరోపించారు. కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ సమక్షంలో జరిగిన తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ భేటీ అజెండాలో తొలి అంశమే బనకచర్ల ప్రాజెక్టు ఉందని అన్నారు కవిత. అలా ఉంటే వెళ్లబోమని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన రేవంత్ రెడ్డి సమావేశంలో ఎలా కూర్చున్నారని ప్రశ్నించారు. “బనకచర్లపై చర్చకు తాను వెళ్లనని సీఎం రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. నిన్నటి ఢిల్లీ సమావేశంలో అజెండాలో మొదటి అంశమే బనకచర్ల. ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్ సిగ్గులేకుండా గోదావరి జలాలను చంద్రబాబు చేతిలో పెట్టారు.” అని ధ్వజమెత్తారు. ఇలాంటి నాన్‌సీరియస్ ముఖ్యమంత్రి తప్పుకోవాలని రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఇంకా టీడీపీ కాలేజీ స్టూడెంట్‌గానే ఉన్నారని అందుకే ఆ పార్టీకి అనుకూలంగా పనులు చేస్తున్నారని మండిపడ్డారు. “బనకచర్లపై చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారు. బనకచర్లపై చర్చ జరిగిందని ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ మంత్రి నిమ్మల చెప్పారు. కేంద్రం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో కూడా ఈ అంశం స్పష్టంగా ఉంది. అందుకే తెలంగాణ హక్కులను కాలరాసిన నాన్ సీరియస్ ముఖ్యమంత్రి తన పదవి రాజీనామా చేయాలి. తన స్కూల్ బీజేపీ, కాలేజీ టీడీపీ, ఉద్యోగం కాంగ్రెస్‌లో అని సీఎం చెప్పారు. ముఖ్యమంత్రి ఇంకా కాలేజ్‌లోనే ఉన్నానని అనుకుంటున్నారు. అందుకే గోదావరి నీళ్లను చంద్రబాబుకు గిఫ్టుగా ఇచ్చారు. “ కవిత కామెంట్స్ చేశారు. బనకచర్ల, పోలవరంపై న్యాయపోరాటం చేస్తామని అన్నారు కవిత. ఈ దేశ న్యాయవ్యవస్థలపై తమకు నమ్మకం ఉందని చెప్పుకొచ్చారు. పార్లమెంట్ సమావేశాల టైంలో తెలంగాణ అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

## మార్కెటింగ్ కమిటీ చైర్మన్ సన్మానించిన జిల్లా నాయకులు శ్రీధర్ యాదవ్



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 17:** పెనుమూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్గా నియమితులైన కృష్ణమనాయుడును తెలుగు దేశంపార్టీ అధిష్టానం నిర్మించారు యాదవ సాధికార సమితి జిల్లాఅధ్యక్షులు శ్రీధర్ యాదవ్ గురువారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీకి ఎనలేని సేవలు అందించి నేడు మార్కెటింగ్ కమిటీ చైర్మన్గా నియమితులైన కృష్ణమ నాయుడును గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగిందని అన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాబునాయుడు, వెంకటేష్ యాదవ్ తదిత రులు పాల్గొన్నారు.

### చిలమత్తూరు సింగల్ విండో అధ్యక్షురాలుగా

## బాధ్యతలు స్వీకరించిన ఆర్.చెన్నమ్మ.

### అభినందించిన పార్టీ నాయకులు.





**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 17:** హిందూపురం శాసనసభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆశీస్సులతో ఇటీవల చిలుమత్తూరు మండలం సింగల్ విండో అధ్యక్షురాలుగా ఎంపిక కాబడిన పార్లమెంటు తెలుగు మహిళ కార్యదర్శి వీరాపురం మాజీ సర్పంచ్ ఆర్.చెన్నమ్మ గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఓ శుభ ముహూర్తాన సింగిల్ విండో కార్యదర్శి సమక్షంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత సలహాదారులు డాక్టర్ సురేంద్ర, నియోజకవర్గ సమన్వయ కర్త శ్రీనివాస్ రావు సూచనల మేరకు దస్త్రాలలో సంతకం చేసారు. అనంతరం ఆమెను ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, నియోజకవర్గ సమన్వయ కర్త శ్రీనివాస రావు, మున్సిపల్ చైర్పర్సన్ డిఈ రమేష్ కుమార్, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వేంకటలక్ష్మి తదితరులు సన్మానించి అభినంద నలు తెలిపారు. ఈ సందర్భంగా సింగల్ విండో అధ్యక్షురాలు ఆర్.చెన్నమ్మ మాట్లాడుతూ శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆశీస్సులతో సింగిల్ విండో అధ్యక్షరాలుగా ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యేకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, చిలమత్తూరు మండలం నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. నాకుఇచ్చిన బాధ్యతని సమర్థవంతంగా నిర్వహించి రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. సింగిల్ విండోను బలోపేతం చేసి అభివృద్ధికీ కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జి ఆకుల ఉమేష్, ఎమ్మెల్యే పి.ఏ.బాలాజీ ఐటిడిపి పార్లమెంట్ అధ్యక్షులు రామాంజనేయులు, పట్టణ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి, కౌన్సిలర్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

# మేక్ ఇన్ ఇండియాకు తూట్లు!



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మేక్ ఇన్ ఇండియాకు అమెరికా తూట్లు పొడిచే ప్రయత్నంలో ఉంది. ఇప్పటికే దేశంలో మందగమనాన్ని ఎదుర్కొంటున్న తయారీ రంగం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలతో మరింత ఒత్తిడిని ఎదుర్కొనే సంకేతాలు కనబడుతున్నాయి. అమెరికా-భారత్ మధ్య జరుగుతున్న నాలుగు రోజుల వాణిజ్య చర్చలు గురువారం నాటితో ముగియనున్నాయి. ఆగస్టు 1 గడువు ముందు తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకునే దిశగా చర్చలు వేగంగా సాగుతున్నాయి. జన్యు మార్పిడి విత్తనాలు, పాడి రంగం, స్టీల్, ఆల్యూమినియం, ఆటోమొబైల్ రంగాలు ఈ చర్చలలో కీలక అంశాలుగా ఉన్నాయి. ఈ చర్చల వివరాలను ఇరు దేశాలు చాలా రహస్యంగా ఉంచుతున్నాయి. భారత అధికారులు ఎలాంటి అంశాలను బయట పెట్టడం లేదు. ఈ సంప్రదింపుల్లో అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గితే ముఖ్యంగా స్టీల్, ఫార్మా, ఆటో పరిశ్రమ రంగాలు సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యుఎస్‌లో పూర్తిగా తయారయిన విద్యుత్ వాహనాలు భారత్‌కు భారీగా దిగుమతి కానున్నాయి. దీంతో ఇక్కడి వాహన పరిశ్రమ గడ్డుకాలాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఫార్మా రంగంపై యుఎస్ అధిక టారిఫ్‌లు విధిస్తే ఎగుమతులు తగ్గనున్నాయి. మరోవైపు స్టీల్ రంగంలో 50 శాతం టారిఫ్‌లు ఎగుమతులను దెబ్బతీయనున్నాయి. దీంతో భారత్‌లోని ఈ పరిశ్రమల్లో తయారీ తగ్గనుంది. స్టీల్ ఉత్పత్తులపై అధిక టారిఫ్‌ల వల్ల 2024-25లో ఆ రంగం ఎగుమతులు 2.8 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ టారిఫ్‌లను 20 శాతం కంటే తక్కువకు తగ్గించాలని భారత్ కోరుతోంది. మరోవైపు తనకు ఆకర్షణీయమైన ఒప్పందం కోసం అమెరికా అన్ని ఒత్తిడిలను చేస్తోందని సమాచారం. అమెరికా తన ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) కంపెనీలైన టెస్లా, ఫోర్డ్‌కోసం భారత మార్కెట్‌లో సులభమైన ప్రవేశం కోరుతోంది. ప్రస్తుతం వీటిపై ఉన్న 70-100 శాతం దిగుమతి సుంకాలను తగ్గించాలని డిమాండ్ చేస్తోంది. అదనంగా బ్యాటరీలు, సెమీకండక్టర్ తదితర ఆటో కాంపోనెంట్‌లపై 15-30 శాతం సుంకాలను తగ్గించాలని అడుగుతోంది. తక్కువ సుంకాలను విధిస్తే రెడీమేడ్ కార్లను భారత్‌కు ఎగుమతి చేయాలని యుఎస్ భావిస్తోంది. ఇందుకు టెస్లా కార్ల దిగుమతినే ముఖ్య ఉదాహరణ. కాగా.. భారత్ ఇక్కడి వాహనాల కంపెనీలకు మద్దతుగా మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉత్పత్తిని పెంచేలా ప్రోత్సాహాలను ఇస్తుంది. ఒక వేళ అమెరికా కంపెనీలకు సులభ మార్కెట్‌ను అనుమతిస్తే.. ఇక్కడి వాహన పరిశ్రమలు ఆర్థిక ఒత్తిడిలోకి జారుకునే ప్రమాదం ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో గోల్డ్ రేట్స్




బంగారం కొనుగోలు చేసేవారికి తీపి కబురు. నేడు బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. భారతదేశంలో బంగారినికి ఉన్న డిమాండ్ దేనికి ఉండదు. చాలా మంది ఎక్కువగా కొనుగోలు చేసే దానిలో బంగారమే ముందుంటుంది. మరీ ముఖ్యంగా మహిళలకు బంగారం చాలా ఇష్టం ఉంటుంది. అందుకే వారు ఏ చిన్న శుభ కార్యం జరిగినా సరే బంగారమే కొనుగోలు చేయాలి అనుకుంటారు. ఇక ప్రస్తుతం బంగారం ధరలు విపరీతంగా పెరుగుతూ లక్షకు చేరువ అవుతున్న విషయం తెలిసిందే. దీంతో సామాన్యులు బంగారం కొనుగోలు చేయడానికే భయపడుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. కానీ నేడు ( గురువారం) బంగారం ధరలు అతి స్వల్పంగా తగ్గాయి. కాగా, మనం నేడు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం, తెలుగు రాష్ట్రల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర తులం రూ.99,270, 22 క్యారెట్ల బంగారం తులం రూ.90,990, 18 క్యారెట్ల బంగారం తులం రూ.74,450గా ఉంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర తులం రూ.99,270, 22 క్యారెట్ల బంగారం తులం రూ.90,990, 18 క్యారెట్ల బంగారం తులం రూ.74,450గా ఉంది. గుంటూరులో 24 క్యారెట్ల బంగారం ధర తులం రూ.99,270, 22 క్యారెట్ల బంగారం తులం రూ.90,990, 18 క్యారెట్ల బంగారం తులం రూ.74,450గా ఉంది. మిగతా అన్ని నగరాల్లోనూ దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి. జూలై 17, 2025న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,270 గా ఉండగా,22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.90,990గా ఉంది. జూలై 16, 2025 బుధ వారం (నిన్న)24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,780గా ఉండగా,నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.99,270గా ఉంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్న రూ.91,000గా ఉండగా, నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.90,990గా ఉంది. ప్రముఖ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,270 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.90,990 లుగా ఉంది. ఇక నేడు సిల్వర్ ధర స్వల్పంగా తగ్గింది. కిలో వెండి పై రూ.100 తగ్గడంతో కేజీ వెండి రూ.1,23,900గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,270 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.90,990లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,23,900 లుగా ఉంది.వరంగల్ జిల్లాలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,270. 22 క్యారెట్ల ధర రూ.90,990లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,23,900లుగా ఉంది.

# టెస్టు క్రికెట్ లెజెండ్స్

## అత్యధికసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు'లు అందుకుంది వీరే




టీమిండియా- ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్.. క్రికెట్ ప్రేమికులకు అసలు సిసలైన సంప్రదాయ ఫార్మాట్ మజాను అందిస్తోంది. ఆండర్సన్- టెండుల్కర్ ట్రోఫీలో భాగంగా ఇరుజట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్‌లో ఇప్పటికి మూడు పూర్తయ్యాయి. అయితే, ఈ మూడు టెస్టులు ఆఖరిదైన ఐదో రోజు వరకు ఉత్కంఠగా సాగడం ఒక విశేషమైతే.. అ?న్నింటిలోనూ ఫలితం కూడా తేలడం మరో విశేషం. లీడ్స్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ మ్యాచ్‌ను టీమిండియా నుంచి లాగేసుకుని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక ఎడ్జ్‌బాస్టన్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన టీమిండియా సారథి శుబ్మన్ గిల్ డబుల్ సెంచరీ (269), సెంచరీ (161)లతో అదరగొట్టి.. భారత్‌కు ఏకపక్ష విజయం అందించాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలిసారి టీమిండియా గెలుపు జెండా ఎగరవేయడంలో కీలక పాత్ర పోషించి ఈ అవార్డు అందుకున్నాడు. అయితే, లార్డ్స్ టెస్టులో మాత్రం ఆతిథ్య జట్టు మరోసారి పైచేయి సాధించింది. కెప్టెన్ బెన్ స్టోక్స్ ఇటు బ్యాట్‌తో.. అటు బంతితో రాణించి.. జట్టును గెలిపించుకున్నాడు. తద్వారా 2-1తో ఆధిక్యంలో నిలిపాడు. ఇలా మూడు టెస్టుల్లో ఒక్కొక్కరు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. మరి టెస్టు ఫార్మాట్లో అత్యధికసార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్న క్రికెటర్ల జాబితాలో టాప్-5లో ఉన్నది ఎవరో తెలుసా?!.. సంప్రదాయ క్రికెట్‌లో అత్యధిక పరుగుల వీరుడి (15921)గా ఉన్న టీమిండియా దిగ్గజం సచిన్ టెండుల్కర్ మాత్రం ఈ జాబితాలో లేకపోవడం గమనార్హం.

**జాక్వెస్ కలిస్**

సౌతాఫ్రికా లెజెండరీ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్ టెస్టుల్లో అత్యధికంగా 23 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తన కెరీర్‌లో 166 టెస్టు మ్యాచ్‌లు ఆడిన కలిస్.. 13289 పరుగులు చేశాడు. ఇందులో 45 శతకాలు, రెండు డబుల్ సెంచరీలు ఉన్నాయి.

**ముత్తయ్య మురళీధరన్**

శ్రీలంక స్పిన్ దిగ్గజం టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్ల వీరుడు (800). అతడు తన కెరీర్‌లో 133 టెస్టులాడి 19 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు.

**వసీం అక్రం**

పాకిస్తాన్ ఐకానిక్ ఫాస్ట్ బౌలర్ వసీం అక్రమ్ తన కెరీర్‌లో 104 టెస్టులు ఆడి.. 414 వికెట్లు కూల్చాడు. తన నిలకడైన బౌలింగ్‌తో ఈ స్వింగ్ సుల్తాన్ పదిహేడు సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**షేన్ వార్న్**

ఆస్ట్రేలియా స్పిన్ లెజెండ్ షేర్ వార్న్. అంతర్జాతీయ క్రికెట్‌లో 145 టెస్టులు ఆడిన వార్న్.. 708 వికెట్లు పడగొట్టాడు. అతడి ఖాతాలోనూ పదిహేడు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు ఉన్నాయి.

**కుమార్ సంగక్కర**

శ్రీలంక మాజీ కెప్టెన్, స్టైలిస్ లెఫ్టాండ్ బ్యాటర్ కుమార్ సంగక్కర తన కెరీర్‌లో 134 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. నిలకడైన ప్రదర్శనలతో శ్రీలంక బ్యాటింగ్ లైనప్ ప్రధాన పిల్లర్‌గా పేరొందిన సంగక్కర పదహారు సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. సంగక్కర టెస్టుల్లో 38 సెంచరీలు, 11 డబుల్ సెంచరీల సాయంతో 12400 పరుగులు సాధించాడు. అ న్న ట్లు చెప్పనే లేదు కదూ! సచిన్ తన కెరీర్‌లో పద్నాలుగు సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు.

## స్పోర్ట్స్

### సాత్విక్ - చిరాగ్ జోడీకి షాక్..

### రెండో రౌండ్‌లోనే లక్ష్య సేన్ ఓటమి




జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్లకు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా.. లక్ష్య సేన్ సాత్విక్ - చిరాగ్ ఆమెను అనుసరిస్తూ ఇంటిదారి పట్టారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఎనిమిదో ర్యాంకర్ సేన్ తేలిపోయాడు. స్థానిక ఆటగాడు కొడాయ్ నరొకా చేతిలో 19-21, 11-21తో అనూహ్యంగా కంగుతిన్నాడు. డబుల్స్‌లో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన సాత్విక్ సాయిరాజ్ %-% చిరాగ్ శెట్టి ద్వయం తొలి రౌండ్‌లో అద్భుత విజయం సాధించింది. అయితే.. రెండో రౌండ్‌లో మాత్రం ఐదో సీడ్ జంట ధాటికి చేతులెత్తేసింది భారత జోడీ. గురువారం హెూరాహెూరీగా జరిగిన పోరులో లియాంగ్ వీ కెంగ్ వాంగ్ చాంగ్ (చైనా) జంటకు బదులివ్వలేకపోయింది చిరాగ్ ద్వయం. తొలి సెట్‌లో గట్టిగానే పోరాడినా..22-24తో వెనకబడింది. రెండో సెట్‌లో పుంజుకుంటారనుకుంటే బలహీనమైన డిఫెన్స్ కారణంగా 14-21తో దారుణ ఓటమి చవిచూసింది. ఈ పరాజయంతో చైనీస్ షట్లర్లు భారత స్టార్లపై తమ విజయాల ఆధిక్యాన్ని 7-2కు పెంచుకున్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143